# ఇట్లా-పెళ్ళి

మెడికో స్వజన

**వాకిట్లో ఆటోలు ఆగిన చప్పుడైంది. అనసూయమ్మ హడావిడిగా ముందు గదిలోకి రాబోతోంది. సుబ్బరామయ్య కంగారుగా వచ్చేశాడు.**

**"వాళ్ళు వచ్చేస్తున్నారు అనసూయా..అన్నీ రెడీగా వున్నాయా?"**

**"ఆ. అన్నీ సిద్ధం చేశాను లెండి. ముందు మీరెళ్ళి వాళ్ళను లోపలికి తీసుకురండీ" అంటూ పక్క గదిలోకి పరుగెత్తిందామె.**

శారద అద్దం ముందు కూర్చుని తీరిగ్గా జడ వేసుకుంటోంది. అనసూయమ్మకు కాలూ చేయీ ఆడటం లేదు.

"అదేంటే? ఇంకా ఇక్కడే కూర్చున్నావూ! అవతల వాళ్ళొచ్చారు. తొందరగా తయారవ్వూ! ఇదిగో లక్ష్మీ!అట్లా గుమ్మం పట్టుకుని ఆ వచ్చేవాళ్ళని చూడకపోతే ఇక్కడికొచ్చి అక్కకు సాయం చెయ్యకూడదూ. అబ్బబ్బ! ఎన్నింటికి వేవొక్కదాన్నే చచ్చేదీ.." అని విసుక్కుంటూ వంటింట్లోకి దూరింది అనసూయమ్మ. శారద ఏదో అందామనుకుంది గాని సందర్భం కాదని వూరుకుంది.

లక్ష్మి శారద దగ్గరకు పరుకెత్తుకువచ్చి—

"అక్కా పెళ్ళి కొడుకు బాగున్నాడే..చూడ్డానికి అచ్చంగా హీరోలా వున్నాడు" అంటూ చెప్పకుపోతోంది.

శారద అనాసక్తంగా వుంటూ సింపుల్‌గా ముస్తాబయ్యింది. నిజానికి శారదకీ పెళ్ళి చూపులు ఇష్టం లేదు. అలాగని పెళ్ళంటే ఇష్టం లేదని కాదు. పెళ్ళవేది చేసుకుని తీరాల్సిన వ్యవహారమే. ఎంత ఉద్యోగం చేస్తూ జీతం ఇంట్లో ఇస్తున్నా ఆడపిల్లకు ఈడు రాగానే పెళ్ళికి తొందర పడని తల్లిదండ్రులుండరని ఆమెకి తెలీక కాదు. తను ఎంమ్మెస్సీ చదివింది. ఎన్.ఐ.ఐ.టి.లో ఒక బ్రాంచికి ఇన్‌ఛార్జ్‌గా పని చేస్తోంది. అంతో ఇంతో అందంగా వుంటుంది. కట్నం లేకుండా చేసుకోవడానికి కూడా కొంతమంది కుర్రాళ్ళు ఉత్సాహపడ్డారు. శారదే పడనీయలేదు. ముక్కూ, మొహం తెలీని వాడికి ఒక్కసారిగా అమాంతం జీవితంలో భాగం పెట్టడం సబబుగా అనిపించడంలేదామెకు. అట్లాగని ఆమె ఎవరినైనా ప్రేమించిందా అంటే అదీ లేదు. శారదకు మొదటి నుంచీ తన కెరీర్ మీదే శ్రద్ధ జాస్తిగా వుండేది. నేటి కాలం ప్రేమ మీద ఆమెకు పెద్ద సదభిప్రాయం కూడా లేదు. ఎంచుకునే భాగస్వామిని, అటు అబ్బాయైనా, ఇటు అమ్మాయైనా కొంత కాలం స్నేహం తర్వాత, ఒక అభిప్రాయం ఏర్పర్చుకున్నాక అవగాహనకు రావటం మంచిదని ఆమె నిశ్చితాభిప్రాయం. సుబ్బరామయ్య పెద్దగా అడ్డు చెప్పక పోయినా, అనసూయమ్మ మండిపడేది శారద మాటలకు.

"ఏమిటా పిచ్చి మాటలు? పెళ్ళి కాకముందు ఏట్లా తెలుస్తుంది? కలసి తిరగటం ఎంత చేటు? హవ్వ? మా కాలంలో వుందా? ఏమిటీ పిదప బుద్ధులు? ఏదైనా కారణం చేత పెళ్ళి ఆగిపోతే ఆడపిల్లకు ఎంత అప్రతిష్ఠ? మగవాడికేం? ఎంత తిరిగినా ఏమీ కాదు. నువ్వీ పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని చక్కగా నాన్న తెచ్చిన సంబంధం గురించి ఆలోచించు.కన్నూ, ముక్కూ వచ్చితేనే ఆలోచించు. అంతే కాని వాడితో పాటు కొంత కాలం తిరిగి చేసుకుంటానంటే ఎట్లాగే? మా రోజుల్లో మేమిట్లా అఘోరించామా? తలొంచుకుని తాళి కట్టించుకోలేదూ? తరువాత తల రాత ఎట్లా వుంటే అట్లా అవుతుంది!" అని దులిపేసింది అనసూయమ్మ.

తల్లితో వాదించి ప్రయోజనం లేదని శారదకు తెలుసు. అందుకే మౌనంగా పెళ్ళి చూపులకు తయారైంది.

వచ్చిన వాళ్ళకు మర్యాదలు బాగా జరిగాయి. అబ్బాయి చూడ్డానికి బాగానే వున్నాడు. తనూ కంప్యూటర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాట్ట అమెరికాలో. పిల్లాడి తల్లి రెండు మూడు ప్రశ్నలు వేసింది. తండ్రి అవీ వేయలేదు. అబ్బాయి చెల్లెలు తనకన్నా ఒకేడాది చిన్నది. బాగా చనువుగా దగ్గరకొచ్చి కూర్చుంది. మొత్తానికి పెళ్ళి చూపుల కార్యక్రమం హుూందాగా, ఘనంగా జరిగిపోయింది. పిల్లాడి తల్లీదండ్రులు ముందే అన్నారు. "మా అబ్బాయికి నచ్చితే చాలు. మాదేముంది? చేసుకునేది వాళ్ళు. అమ్మాయిక్కూడా పిల్లవాడు నచ్చాలి".

"నాకు చాలా నచ్చింది" అంది పిల్లాడి చెల్లెలు హుషారుగా.

అబ్బాయి కూడా అవునన్నట్టు తలూపాడు.

వెడుతూ వెడుతూ పిల్లాడి తండ్రి అన్నాడు—

"మీకు అంగీకారమైతే వెంటనే కానిద్దాం. అబ్బాయి వచ్చే నెలలోనే అమెరికా వెళ్ళేది. మళ్ళీ మూడేళ్ళ దాకా రాడు. అదీ మా తొందర".

"ఇంత తొందరగా అంటే ఎలా? కాస్త కాలూ, చేయీ కూడదీసుకోవాలి గదా!" సుబ్బరామయ్య దిగులుగా అన్నాడు.

"మీరు మరీ భారీ ఎత్తున పెట్టుకోవద్దు. మా ఇంట్లో ఎవరికీ ఇలాంటి సందర్భాల్లో ఆర్భాటం ఇష్టం వుండదు. పెళ్ళి ఎంత సింపుల్‌గా జరిపిస్తే అంత మంచిది" అంటూ వెళ్ళిపోయారు వాళ్ళు.

సుబ్బరామయ్య సంతోషానికి అవధుల్లేవు. అనసూయమ్మకైతే అమెరికా సంబంధం ఇంత తొందరగా, ఇంత తేలిగ్గా దొరకటం కలలాగా వుంది. ఆమైతే దేవుడి పటం ముందు సాష్టాంగపడింది.

లక్ష్మి హడావిడికీ అంతు లేదు.

కాని శారద మాత్రం అంత త్వరగా రాజీ పడలేకపోతోంది."అబ్బాయెలాంటివాడో తెలుసుకోకుండా ఒప్పేసుకోవటమేనా?" తల్లిని కసురుకున్నట్టుగా మాట్లాడింది.

"నువ్వింక మాట్లాడవద్దు" గదమాయించింది అనసూయమ్మ.

"నేను కూడా ఇంతకంటే మంచి సంబంధం తేలేనమ్మా!"సుబ్బరామయ్య వంత.

తన ఆశయం మేరకు జీవిత భాగస్వామి ఎంపిక జరగనందుకు ఆమెకు అసంతృప్తిగా వుంది. భోజనాల దగ్గరా ఈ విషయాలే నలుగుతున్నాయి.

ఇంతలో 'టెలిగ్రాం' అంటూ కేక వినపడటంతో లక్ష్మి వెళ్ళి అందుకుంది.

"హౌస్ ఓనర్ బాంబే నుంచి ఇచ్చాడు నాన్నా".

"ఏమిటో చదవ్వే!" అన్నాడు.

"కమింగ్ సూన్. ప్లీజ్ వెకేట్ ది ఫ్లాట్ – లెటర్ ఫాలోస్".

"ఇంటి ఓనరొచ్చేస్తున్నాడు. మనం వెంటనే ఇల్లు ఖాళీ చేయాలట! వివరాలతో రేపు ఉత్తరం వస్తుందట!" లక్ష్మి చదివి చెప్పేసరికి సుబ్బరామయ్యకు గుండెల్లో రాయి పడినట్టయింది.

తెల్లారి వచ్చిన ఉత్తరం చదివాడు. ఆయనకు హైదరాబాద్ ట్రాన్స్‌ఫరైందట! వారం రోజుల్లో జాయినవ్వాలట! నెల రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసిచ్చాడు. అగ్రిమెంటు ప్రకారం నెల రోజుల నోటీసు చాలు.

"నెల రోజుల్లో ఇల్లెక్కడ దొరుకుతుందండీ! అమ్మాయి పెళ్ళి కూడా వుందాయె! ఇప్పటికిప్పుడు ఖాళీ చేయాలంటే ఎలా?" అంది అనసూయమ్మ కంగారుగా.

"అదే కదా నా బాధ కూడా! అయినా భాగ్యనగరంలో ఇళ్ళకేం కొదవుంది? బోలెడు టైముంది. కాకపోతే మనకు నచ్చినవి దొరకాలి గాని" అన్నాడు



సుబ్బరామయ్య.

ఇళ్ళ వేటలో ఓ వారం రోజులు గడిచిపోయాయి. అనసూయమ్మకి ఓ పట్టాన నచ్చదు. ఒకింటికి అలమారాలు లేవంటుంది. ఇంకో ఇంటికి అటకలు లేవంటుంది. రెండూ వున్న ఇల్లు దొరికితే తగిన జాగా లేదంటుంది. అన్నీ వున్న ఇల్లు దొరికితే లొకాలిటీ బాగా లేదంటుంది. ఇట్లాగే పది రోజులు గడిచిపోయాయి. హౌస్ ఓనరు రెండు రోజులకో ఉత్తరం రాస్తున్నాడు. ఇంకా వారం రోజులే వుంది అతడిచ్చిన గడువు.

"ఇంక నీ సవాలక్ష వంకలకు ఇల్లు దొరకటం కల. నా వల్ల కాదు" అంటూ చేతులెత్తేశాడు సుబ్బరామయ్య.

అనుకోకుండా శారద పనిచేసే ఆఫీసు వెనుక కాంప్లెక్స్‌లో ఒక అపార్ట్‌మెంట్ ఖాళీ అయ్యింది. చూట్టానికి బావుంది అనటంకంటే అనసూయమ్మకు అన్ని విధాలా నచ్చింది అనటం రైటు. అందుకే కాస్త అద్దె ఎక్కువయినా వెంటనే అందులోకి మారిపోవటానికి సిద్ధమయ్యారు. బాంబేలో వున్న ఓనరుకి లెటర్ రాసిపడేసి కొత్తింట్లోకి వచ్చారు.

చేరినప్పటి మంచి అనసూయమ్మ ఒకటే సణుగుడు.

"కాంప్లెక్స్ బాగుందని వచ్చాము. గోడలకేమిటి ఇట్లా మేకులు దిగిపోతున్నాయి? మట్టి పెట్టి కట్టారు కాబోలు! అని ఒక సారి, ఫ్యానులు, ట్యూబులైట్లు పెట్టించాడు బాగానే వుంది. మీటరు ఇంత స్పీడుగా తిరుగుతుందేమిటి? కరెంటు బిల్లు బోలెడంత అవుతుందేమోరా దేవుడా?" అని దిగులుగా ఇంకోసారి.

'అలమారాలు, అటకలు వున్నాయని మురిసిపోయామే గాని, పాడు ఎలుకలు ఎక్కడ్నుంచో వస్తూనే వున్నాయి. అన్నీ పాడుచేసి పోతున్నాయి" అని మరోసారి సణుక్కుంటోందావిడ.

దానికి తగ్గట్టు రెండు రోజుల్నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. అపార్ట్‌మెంట్ చుట్టూ నీళ్ళు నిలబడి పోయాయి. ఎడతెరిపి లేని వానకి గోడలు చెమ్మగిల్లి తేమగా తయారైంది.

"తొందరపడి ఈ అపార్ట్‌మెంట్లో చేరకుండా వుండాల్సింది. అంతా నీ మూలంగానే జరిగింది. ఛ! ఇక్కడికొచ్చినప్పటి మంచీ మనశ్శాంతి కరువైంది" అంటూ భార్య మీద విరుచుకుపడ్డాడు సుబ్బరామయ్య.

"బాగుంది. నన్నంటారెందుకు అందరూ! మీరూ చూశారుగా! ఏదో పైపైన చూట్టానికి బాగుంది. కొత్తగా పెయింటు వేయించారు, చక్కగా వుంది అనుకున్నాం కాని ఇలా పైన పటారం, లోన లొటారం అని మనం కలగన్నామా ఏమిటి?" అంది అనసూయమ్మ చేతులు విరుస్తూ.

"పోనీ ఈ అపార్ట్‌మెంటు మళ్ళీ ఖాళీ చేద్దామా?" అంది లక్ష్మి.

"నేకేమన్నా పిచ్చా! మాటిమాటికీ ఇల్లు మారటం మాటలతో పనా? మూటలతో పని కాని" అంది అనసూయమ్మ.

"అందుకే చేరేముందే అన్నీ చూసుకోవాలి. పైన పెయింటింగ్ చూసి ఇంట్లో దిగితే ఇంతే వుంటుంది. ఏ విషయంలోనైనా సరే! పైపై మెరుగులు చూసి మోసపోకూడదు" అంది శారద తనకిష్టం లేని పెళ్ళిచూపులను శ్లేషగా దెప్పుతూ.

అనసూయమ్మ చివుక్కున తలెత్తి చురుగ్గా చూసింది శార ద వైపు. సుబ్బరామయ్య కూడా ఒక్కసారి శారద వైపు చూశాడు.

"అవున్నానా! ఇల్లు బాగా లేదని ఖాళీ చేసెయ్యగలం. కానీ రేవు నా పెళ్ళై తేడాలొస్తే ఇలా చేయగలమా? అబ్బాయి అమెరికాలో కంప్యూటర్ ఇంజనీరు. బానే వుంది. అతడూ బాగానే వున్నాడు. ఓకే. అమ్మాయినిచ్చేటప్పుడు ఆరు తరాలు అటూ ఇటూ చూడాలన్నారు పెద్దలు. కానీ కనీసం మనం వాళ్ళ గురించి, అబ్బాయి గుణగణాల గురించి విచారించకుండా డాబు, దర్పం, ఉద్యోగం, హోదాలని చూసి తల ఆడించడం సబబా? కలసి కలకాలం కాపురం చేయాల్సిన వ్యక్తి నైజం ఎలాంటిదో ఒక్క రవ్వ కూడా తెలుసుకోకుండా నేనెలా ఒప్పుకోను ఈ పెళ్ళికి?" అంటూ శారద ఆవేదనగా, ఆవేశంగా నిర్మొహమాటంగా తన మనసులో మాట చెప్పేయడంతో అనసూయమ్మ మారు మాట్లాడలేదు. సుబ్బరామయ్య ఆలోచనలో పడ్డాడు.

వెంటనే ఆయన ఆ అమెరికా అబ్బాయి గురించి విచారణ మొదలుపెట్టే పనికి పూనుకున్నారు. చివరికి తేలిందేమిటంటే అతనికి ఒక అమెరికన్ యువతితో పెళ్ళయిందనీ, ఆపై పెటాకులైందనీ. అయితే అతడికి పెటాకులైందని కాదు వారు బాధపడింది. ఆ విషయాన్ని అబ్బాయి తరపు వాళ్ళు దాచి వుంచి మభ్యపెట్టినందుకు. అది మభ్య పెట్టడం కూడా కాదు. ఒక రకమైన మోసంగా భావించిన సుబ్బరామయ్య సహించలేకపోయాడు. మా అమ్మాయికి ఇప్పుడే పెళ్ళి చేయడం లేదని చెప్పి వాళ్ళకి టెలిగ్రాం ఇచ్చాడు.

శారద పెళ్ళి ఆమె ఆఫీసులో పని చేస్తున్న అబ్బాయితోనే ఘనంగా జరిగింది అదే ముహూర్తానికి.